క్లుప్తంగా

నిల్వనీటితో రోగాల ముప్పు


నిల్వ నీటిని పారబోయిస్తున్న వైద్య సిబ్బంది

లక్ష్మణచాంద: నిల్వనీటితో రోగాల ముప్పు ఉంటుందని.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. సిబ్బంది వీధులు తిరుగుతూ ఇళ్ల వద్ద ట్యాంకుల్లోఉన్న నిల్వ నీటిని పారబోయించారు. ఏఎన్‌ఎం సుగుణ, ఆశాకార్యకర్త రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ

సారంగపూర్: మండలంలోని యాకర్‌పెల్లి ప్రాథమిక పాఠశాలలో నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. గ్రామానికే చెందిన మేకల లావణ్య జ్ఞాపకార్థం ఆమె భర్త చంద్రశేఖర్ 52 మంది విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్‌లు అందించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, భోజారెడ్డి, నవీన్, వెంకట్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సాయిచంద్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మరణం తీరని లోటని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో సాయిచంద్ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల శంకర్, రాజగంగన్న, గొర్రె గంగాధర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇంకుడుగుంత నిర్మించాలి

నర్సాపూర్(జి): ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించుకొని భూగర్భజలాలను పెంచుకోవాలని ఎంపీడీఓ అల్లాడి వనజ పేర్కొన్నారు. మండలంలోని నందన్‌తండాలో సేవాలాల్ మందిరం దగ్గర శుక్రవారం సామూహిక ఇంకుడుగుంతల ఏర్పాటుకు టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్ కొలతలు తీసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ నందన్ గ్రామంలోని నర్సరీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శి వెంకటేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

లోకేశ్వరం: మండలంలోని రాజూరకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు రాకేశ్, సాయి,మధు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. భైంసా మండలం దేగాంలోని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివాసంలో వారి సమక్షంలో బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, సర్పంచులు ముత్తగౌడ్, శేఖర్‌రెడ్డి, నాయకులు సాయారెడ్డి ఉన్నారు.

కాలినడకన అడెల్లి ఆలయానికి


కాలినడకన వెళ్తున్న భక్తులు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన పలువురు భక్తులు శుక్రవారం అడెల్లి పోచమ్మ ఆలయానికి శుక్రవారం పాదయాత్రగా వెళ్లారు. ఏటా మాదిరి ఈసారి కూడా అడెల్లి పోచమ్మ వద్దకు పసుపు బిందెలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని వేడుకున్నారు. సాయినాథ్, ఈశ్వర్, కారగిరి గంగాభూషన్, సాయి, గోవర్ధన్, గోపాల్ తదితరులు తెలిపారు.

వైభవంగా కుంకుమార్చనలు


కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మల్లన్నగుట్ట హరిహర క్షేత్రంలో శ్రీలలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వైభవంగా సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి, ఆలయ ధర్మకర్తలు వినోదమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజ విశిష్టతను పండితులు భక్తులకు వివరించారు. అనంతరం తీర్థ ప్రసాదం అందజేశారు.

నిలిచిన ఆధార్ సేవలు

కడెం: మండల కేంద్రంలోని మీ సేవా కేంద్రాల్లో పదిహేను రోజులుగా ఆధార్ సేవలు నిలిచిపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మీ సేవా నిర్వాహకులను అడిగితే రెండు నెలలు పడుతుందని చెబుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆధార్ సేవల కోసం జన్నారం, ఖానాపూర్ వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు మండల ప్రజలు. ఉన్నతాధికారులు ఆధార్ సేవలను పునరుద్ధరించాలని మండల వాసులు కోరుతున్నారు.

ఒంటికి, రెంటికి బయటకే..

- పొన్కల్ ఉన్నత పాఠశాలలో సరిపడా లేని మూత్రశాలలు, మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఇటీవల మరికొన్నింటికీ శంకుస్థాపన
- పనుల్లో జాప్యంతో తీవ్ర కష్టాలు
- ప్రస్తుతం బాలలు బయటకు.. బాలికలు ఇళ్లకు వెళ్తున్న వైనం


పునాది దశలో మూత్రశాలల నిర్మాణం


పొలాలకు మూత్రవిసర్జనకు వెళ్తున్న విద్యార్థులు

మామడ: మన ఊరు–మన బడిలో భాగంగా వసతులు కల్పిస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో మాత్రం పనుల్లో జాప్యం నెలకొనడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మామడ మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఒంటికి, రెంటికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వేసవి సెలవుల సమయంలో ఈ పనులు పూర్తి చేయిస్తే సమస్య ఉండేది కాదు. పాఠశాలల పునఃప్రారంభం తర్వాత పనులు ప్రారంభించడంతో సమస్య తలెత్తింది.

పాఠశాలలో 550 మంది విద్యార్థులు..

పొన్కల్ జెడ్పీ సెకండరీ పాఠశాలలో 550 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 232 మంది బాలికలు, 318 మంది బాలురు. పొన్కల్‌తోపాటు కమల్‌కోట్, అనంతపేట్, పోతారం, నల్దుర్తి గ్రామాల చెందిన వారంతా ఇక్కడకు వచ్చి చదువుకుంటున్నారు.

ప్రభుత్వ నిబంధనలివీ..

స్వచ్ఛ విద్యాలయం నిబంధనల ప్రకారం పాఠశాలలో 40 మంది బాలురకు ఒక యూనిట్ (మరుగుదొడ్డి, మూడు మూత్రశాలలు) ఉండాలి. బాలికలకు మాత్రం ఒక యూనిట్ (మరుగుదొడ్డి, మూడు మూత్రశాలలు) ఉండాలి.

సరిపోక అవస్థలు..

పొన్కల్ పాఠశాలలో ప్రస్తుతం ఐదు మూత్రశాలలు, ఓ మరుగుదొడ్డి ఉన్నాయి. వీటిలో మూడు మూత్రశాలలు, మరుగుదొడ్డిని బాలికలు, రెండు మూత్రశాలలను బాలురు వినియోగిస్తున్నారు. విద్యార్థులకు సంఖ్యకు ఇవి సరిపోకపోవడంతో ఒంటికి, రెంటికి బయటకు వెళ్తూ అవస్థలు పడుతున్నారు.

సమీపంలోని చేన్లే దిక్కు..

బాలురు సమీపంలోని చేన్లలోకి వెళ్తుండగా.. బాలికలు ఒంటికి, రెంటికి ఇబ్బందులు పడుతూ ఇళ్లకు వెళ్లి వస్తున్నారు. మరోవైపు పాఠశాలలో తాగునీటి సమస్య కూడా వేధిస్తోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధి నిధులు రూ.ఏడు లక్షలు మంజూరు..

పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సరిపడ మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఉపాధిహామీ నిధులు రూ.ఏడు లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఏడు మూత్రశాలలు, ఏడు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

ఆలస్యంగా ప్రారంభం..

కానీ నిర్మాణ పనులు వేసవి సెలవుల్లో చేయిస్తే బాగుండేది. పునఃప్రారంభం అనంతరం పనులు చేపడుతుండటంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. పాఠశాలలో గతంలో నిర్మించిన మరుగుదొడ్లు బాగున్నప్పటికీ వాటిని తొలగించారు. ప్రస్తుతం పాఠశాలలో చేపట్టిన మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పునాది దశలోనే ఉన్నాయి.

బయటకు వెళ్తున్నాం



పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడంతో బయటకు వెళ్లి మూత్ర విసర్జన చేస్తున్నాం. అధికారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయించి మా సమస్య పరిష్కరించాలి. ఇబ్బంది అవుతుంది

– రాజు, ఏడో తరగతి, పొన్కల్ జడ్పీఎస్‌ఎస్

వేగవంతం చేయిస్తాం



పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయించేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఇప్పటికే తాత్కాలికంగా ఏర్పాట్లు చేయించాం. మళ్లీ పాఠశాలకు వెళ్లి వారి ఇబ్బందులు తెలుసుకుంటాం.

– భూమేశ్వర్, సర్పంచ్, పొన్కల్

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం


దగ్ధమైన సామగ్రి పరిశీలిస్తున్న బాధితుడు

నిర్మల్‌రూరల్: మండలంలోని భాగ్యనగర్ గ్రామంలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఆర్‌ఐ మోహన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరీ సాయమ్మకు చెందిన ఇంట్లో మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. కుటుంబసభ్యులు వ్యవసాయ పనుల నిమిత్తం పంట చేనులోకి వెళ్లారు.మంటలతో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, బట్టలు, విద్యుత్ ఉపకరణాలు, ఆహార ధాన్యాలు పూర్తిగా కాలిపోయినట్లు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.ఐదు లక్షల వరకు ఉంటుందన్నారు. గమనించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. పంచనామా నిర్వహించి నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆర్‌ఐ వివరించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

తానూరు: తమకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మురళిమోహన్ మట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు రెండు నెలలుగా భోజన బిల్లులు, తొమ్మిది నెలలుగా కోడిగుడ్ల బిల్లులు అందడం లేదన్నారు. కార్మికులకు గౌరవ వేతనం రూ.మూడు వేలు పెంచుతామని సీఎం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు భారతబాయి, గంగాబాయి, సవితాబాయి, గంగాబాయి, పవార్ గోదావరి, కార్మికులు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- మస్కాపూర్ పాఠశాల హెచ్‌ఎం బాలాజీ
- వసతుల కల్పనకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.రెండు వేల వసూలుకు నిర్ణయం

ఖానాపూర్: తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బాలాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని మాస్కాపూర్ గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎంసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో ఉన్న 800 మంది విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయుల కొరత, ఇతర సౌకర్యాల్లేక వారు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. పూర్తిస్థాయి వసతుల కల్పనకు ఒక్కో విద్యార్థి నుంచి ఏటా రూ.రెండు వేలు తీసుకోవాలని నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. ఈ డబ్బులతో పాఠశాలలో ప్రైవేటుగా నియమించిన 14 మంది బోధన సిబ్బందికి వేతనాలు చెల్లించడంతోపాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ స్వప్న, ఉపసర్పంచ్ సాగర్, ఎస్‌ఎంసీ చైర్మన్ పుప్పాల కృష్ణ, వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు దొనికేని నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపించాలి'


మాట్లాడుతున్న భోస్లే మోహన్‌రావు పటేల్

లోకేశ్వరం: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపి బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావ్ పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలో పల్లెపల్లెకు బీజేపీ గడప గడపకూ మోహన్‌రావుపటేల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుభాశ్ పటేల్, నరహరి, పోతన్న, సుమన్‌కుమార్, గజ్వేరి భూమన్న, గోవింద్, దేవేందర్, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా హైమద్

దిలావర్‌పూర్: బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. న్యూలోలంలో పార్టీ ప్రత్యేక సమావేశం నిర్వహించి హైమద్‌ను పార్టీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దిలావర్‌పూర్ సర్పంచ్ వీరేశ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి హరీశ్, ఉంగరాల రాజు, మంద మల్లేశ్, సాయన్న, ఉపసర్పంచ్ నరేందర్, అనిల్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

మామడ: మేరా భారత్ మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా బీజేపీ పోలింగ్ బూత్ స్థాయి కమిటీ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులను సమన్వయం చేస్తూ ఈ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఏలూరి దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అరుణ్, నరేశ్‌చారి, సోషల్ మీడియా కన్వీనర్ రమణ ఏలేటి, చిన్నారెడ్డి, రాజారెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు తరలిరావాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: సికింద్రాబాద్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 9న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సర్వసభ్య సమావేశానికి జిల్లాలోని విశ్వబ్రాహ్మణులు తరలిరావాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కన్వీనర్ అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకోజి కిషన్, పట్టణ ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్యచారి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రామోజీవాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సమాచారమివ్వాలి

- డీఎస్పీ నారాయణనాయక్
- సుభాష్‌నగర్‌లో కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న డీఎస్పీ నారాయణనాయక్

ఖానాపూర్: అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ నారాయణనాయక్ అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌కాలనీలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయమే కాలనీకి చేరుకున్న పోలీసులు ప్రతీ ఇల్లు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సంఘవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. భద్రత, సైబర్ సెక్యూరిటీ, సీసీ కెమెరాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఎస్సై ఆర్.శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్ పుష్ సీడర్‌తో తక్కువ ఖర్చు


సీడర్ సాయంతో విత్తనాలు విత్తుతున్న కూలీలు

కుంటాల: రైతులు సాగు విధానంలో నూతన పద్ధతులను అవలంబిస్తున్నారు. మండలంలోని అందాకూర్ గ్రామ శివారులో శుక్రవారం పటేల్ అనే కౌలు రైతు హ్యాండ్ పుష్ సీడర్ సాయంతో సోయా విత్తనాలను విత్తారు. ఒక్కో హ్యాండ్ పుష్ సీడర్‌ను రూ.7,200తో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇంధనం అవసరం లేకుండానే ఈ పరికరం కేవలం ఓ వ్యక్తి సాయంతో రోజుకు మూడెకరాల్లో విత్తనాలు విత్తుకోవచ్చని రైతు తెలిపారు. దీంతో సోయాబీన్, మొక్కజొన్న, పత్తి, పెసర, మినుము, బెండ విత్తనాలను విత్తుకోవచ్చు. ట్రాక్టర్‌తో విత్తితే ఎకరాకు రూ.6 వేల నుంచి 8 వేల ఖర్చు రాగా ఈ పరికరంతో కేవలం రూ.1500 ఖర్చు వస్తుందని రైతు తెలిపాడు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(బీజెడ్‌సీ), ఎంపీసీఎస్, బీకామ్ కంప్యూటర్స్, బీఏ గ్రూపులలో చేరేందుకు విద్యార్థులు నేరుగా కళాశాలలో కలవాలని సూచించారు.

అధ్యాపకుల కోసం...

మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలలో బోధించడానికి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భూగర్భశాస్త్రం, కామర్స్, కంప్యూటర్స్, చరిత్ర, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులలో అధ్యాపకుల కోసం సంబంధిత సబ్జెక్టులలో పీజీ కలిగి, నెట్, సెట్ ,పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు జూలై 3 నుంచి 7 వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లోని కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం పంచాయతీ ఆవరణలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మహేశ్, శ్రీనివాస్, గంగాధర్, సాయన్న, వంశీకృష్ణ, షేక్ పరీద్‌లకు రూ.2.25 లక్షల విలువైన చెక్కులను సర్పంచ్ ముత్తగౌడ్ అందజేశారు. మాజీ సర్పంచ్ పోతన్న, ఆర్‌ఎస్ నాయకులు భూమేశ్, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించిందని డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. సుమారు 15 మంది ప్రయాణికులు ఫోన్ ద్వారా వారి సూచనలు, సలహాలు తెలియజేశారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వెళ్లే బస్సులను దాబాల వద్ద కాకుండా, ఉడిపి హోటల్ దగ్గర ఆపాలని, స్వర్ణ రూట్‌లో బస్సులు పెంచాలని, చింతాల్‌చాందకు ఉదయం 7 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని, ఇంకా కొన్ని బస్సు రూట్‌లపై ప్రయాణికులు సూచనలు చేశారని వివరించారు. వీటిపై డిపో మేనేజర్ సాయన్న సానుకూలంగా స్పందించారు. ప్రయాణికుల కోరిక మేరకు బస్సులు నడుపుతామని హామీ ఇచ్చారు.

నమూనా ఎన్నికలు

నర్సాపూర్(జి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని సెయింట్ థామస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ బిబిన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ గ్రామ సెయింట్ థామస్ స్కూల్‌లో నాలుగో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు పార్లమెంటరీ తరహాలో శుక్రవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ యాప్‌తో నమూనా ఎన్నికలు నిర్వహించారు. స్కూల్ లీడర్‌గా రచన్, అసిస్టెంట్ స్కూల్ లీడర్‌గా శ్రీ కీర్తి, స్పోర్ట్స్ లీడర్‌గా రితిక, కల్చరల్ లీడర్‌గా మనోజ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షిస్తేనే మానవాళి మనుగడ

కుంటాల: నాటిన మొక్కలను సంరక్షిస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందని సర్పంచ్ దాసరి కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అందాకూర్ గ్రామదేవతల ఆలయాల ఆవరణలో రిలయన్స్ ఫౌండేషన్, డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ రహీం, ఎంపీటీసీ మధుకర్, రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్, కార్యదర్శి రమ్య, ఏపీఎం భోజన్న, లావణ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

బస్సు ట్రిప్పులు పెంచాలి

ఖానాపూర్: మండలంలోని రాజూరా, చందునాయక్‌తండా గ్రామాలకు రోజు వచ్చే ఆర్టీసీ బస్సు ట్రిప్పులను పెంచాలని కోరుతూ ఆయా గ్రామాల నాయకులు శుక్రవారం నిర్మల్ డిపోలో అధికారులను కలిసి విన్నవించారు. డిపో మేనేజర్ సాయన్న లేకపోవడంతో ఫోన్‌లో సమస్య వివరించారు. అనంతరం డిపోలో సిబ్బంది నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇప్పుడు వస్తున్న ట్రిప్పులకు అదనంగా మరో మూడు ట్రిపులు ఖానాపూర్ నుంచి ఉదయం 8:30 గంటలకు, ఉదయం 10:45గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్సును సింగాపూర్, రాజూరా వరకు నడిపిస్తామని చెప్పినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నం రవి, నిమ్మా నాయక్ తదితరులు ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

కుంటాల: రైతుల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకిచ్చే దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలతోపాటు వసూళ్లపై చర్చించారు. దళారి వ్యవస్థను నిర్మూలించేందుకు యాసంగిలో మొక్కజొన్న, వరి, జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈవో నాగభూషణం, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల వినూత్న నిరసన


గుమ్మడి కాయలతో ఆదివాసీల నిరసన

ఖానాపూర్: తమ గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని శుక్రవారం మండలంలోని అడవిసారంగాపూర్‌లో ఆదివాసీలు విద్యుత్ స్తంభాలకు అడవి గుమ్మడికాయలు కట్టి నిరసన తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ పలుమార్లు అధికారులకు విన్నవించామని.. మారుమూల గ్రామం కావడంతోనే తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. చుట్టూ అడవి ఉండటంతో విషసర్పాలు, అటవీ జంతువులు సంచరిస్తాయన్నారు. గ్రామస్తులు వీధిదీపాలను పోలి ఉన్న అడవి గుమ్మడి కాయలను స్తంభాలకు విద్యుత్ బల్బుల స్థానంలో కట్టి వినూత్న నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు. భీంరావు, నైతం శ్రీనివాస్, లక్ష్మి తదితరులున్నారు.

చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్: వాహనాలు నడిపే మైనర్లపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఖాజీ సనావుర్ రహమాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కడెం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్లు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

గంగమ్మతల్లికి పూజలు


గొల్లెనతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని ఉత్తర వాహిని గౌతమి గోదావరి తీరంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గంగపుత్రుల ఆరాధ్యదైవం గంగమ్మతల్లికి సంఘం ఆధ్వర్యంలో చల్లముంతలు, గొల్లెనతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో పరిమి సురేశ్, భీమన్న, రవి, చందు, భీమరాజం, మధు, భీమన్న, గంగాధర్, గణేశ్, నరేశ్, స్వామి, నర్సయ్య, భీమరాజం, భీంరావ్ తదితరులున్నారు.